# విలయ తరంగం



రచయిత్రి

**రచన : శ్రీమతి పచ్చిగోళ్ళ సుధ**

ఆపరేషన్ థియేటర్ ముందున్న బల్లమీద కూర్చున్నాను.

నా చూపులు మూసివున్న తలుపుల మీదే స్థిరంగా వుండిపోయాయ్. లోపల్నుంచి విపరీతమైన బాధతో మూల్గుతున్న నా భార్య మూలుగు తప్ప నా చెవులకు వేరేం వినిపించడం లేదు.

'స్త్రీ ప్రసవించడం అంటే.... పునర్జన్మ ఎత్తడం!' అంటారు యిదేనేమో!

'ఆమెకు ఆపరేషన్ చేయాల్సిన అవసరముస్తుందేమో' అని డాక్టర్ తనతో అంటుంటే ప్రాణం పోయినట్లే అనిపించింది తనకు.

ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాక - ఆమెను థియేటర్ లోకి తీసుకు వెళ్తుంటే నాలో సగభాగాన్ని బలవంతంగా పెకలించుకు పోతున్నట్లనిపించింది.

కృత్రిమమైన ధైర్యాన్ని తెచ్చుకుంటూ అక్కడే కూర్చుండి పోయాను. ఆ క్షణంలో నా మనసు రాయిగా మారితే బాగుండు ననిపించింది.

నర్సులంతా ఆ హడావిడిగా అటూ-ఇటూ తిరుగుతున్నా నా గుండె కొట్టుకుంటున్న శబ్దం చాలా స్పష్టంగా విన్పిస్తోంది.

మొదటి కాన్పు కావడం వల్లనేమో యిలా జరిగింది అని తమాయించుకుందుకు విశ్వప్రయత్నం చేసి అలసిపోయాను.

కర్చీఫ్ తీసుకొని మొఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాను. క్షణాల్లో మళ్ళీ ఆ స్థలాన్ని స్వేద బిందువులు అలుముకున్నాయ్.

ఎందుకో ఆ సమయంలో పిచ్చెక్కితే బాగుండు ననిపించింది. నెమ్మదిగా లేచి అటూ-ఇటూ పచార్లు చేయసాగాను.

దూరంగా పార్కు.. అందులో యవ్వనంలోవున్న గువ్వల జంటలు. పిల్లలు ఐస్‌క్రీమ్‌లు తింటూ చొక్కాలు కరాబు చేసుకొంటున్నారు తలలు నెరిసిన ఒకరిద్దరు వృద్ధులు సిమెంట్ బెంచీలమీద కూర్చుని - తమ బాల్యాన్ని, యవ్వనాన్ని అక్కడున్న వారిలో చూసుకుంటూ, గత కాలపు అనుభవాల్ని-అనుభూతుల్ని నెమరు వేసుకుంటున్నారు.

నా ప్రయత్నం ఏమీ లేకుండానే హృదయపు అట్టడుగు పొరల్లో నిక్షిప్తమై పోయివున్న గత కాలపు జ్ఞాపకాలు మెదిలినయ్.

అవి నేను డిగ్రీ చదువుతున్న రోజులు.

ఓ రోజు - ఏదో సినిమాకి వెళ్ళాను. అది అమితాబ్ నటించిన సినిమా. ఎలాగయినా ఆ రోజు ఆ సినిమా చూడాలన్న నిశ్చయంతో వచ్చాను. అప్పటికే టిక్కెట్స్ అయిపోయాయి. బ్లాక్‌లోనైనా దొరుకుతాయేమోనని చాలా ట్రై చేసాను. అప్పటికే టిక్కెట్స్ తీసుకున్న ఒకరిద్దర్ని అడిగి చూసాను. డబ్బెంతయినా పర్వాలేదు - ఒక టికెట్ యివ్వమని. నిరుత్సాహమే ఎదురయింది. ఏం చెయ్యాలో తోచక జుట్టు పీక్కున్నాను.

"ఇదిగోనండి టిక్కెట్!" తీయగా వినిపించింది.

అటు చూసాను. నా అవస్థ చూచి జాలిపడి ఆమె టిక్కెట్ నాకిచ్చింది. అందమైన ఆమె చేతుల్లోని టికెట్

మీ కొరకు....

మేము

తయారుస్తున్నాము

శ్రీ నిత్యా బనియన్లు

* బనియన్లు
* జెట్టీలు
* ఫేన్సీ కలర్ రకాలు

—: తయారించువారు :—

**Sri Nithya Hosieries**

11-C, Ramaiah Colony
TIRUPUR – 638 602,

Stockists: –

**G. K. Banians**

Vastralatha, Vijayawada-520 001.

అపురూపంగా అందుకున్నాను. ''థాంక్యూ .... థాంక్యూ అన్నాను.

నవ్వుతూ వెళ్ళిపోయిందామె.

గబ-గబా హాల్లోకి పరుగెత్తాను.

అందరి దృష్టి సినిమా మీదే వుంది. నా దృష్టి .... !

నా చెవుల్లో ఆమె నవ్వే ప్రతిధ్వనిస్తుంది. ఆ గొంతులో అంతర్లీనంగా విన్పించిన మాధుర్యం నన్ను వెంటాడుతూనే వుంది. ఆమె కళ్ళలో అంతర్గతంగావున్న చంద్రోదయం. ఆమె పెదవులు చేసిన నాట్య విన్యాసం - ఆమె కనురెప్పలు ప్రదర్శించిన నృత్య విలాసం నాకు ఏమాత్రం తెలీకుండానే నా హృదయంలో నివాసం ఏర్పరుచుకున్నాయ్.

ఆ హాల్లోనే కాదు ...ఆ రోజంతా....

అంతేకాదు - చాల రోజులవరకూ ఆమె నా దృష్టిపథంలో, స్మృతిపథంలో కదుల్తూనే వుంది. నా కళ్ళు ఎప్పుడూ ఆమెకోసం గాలిస్తూనే వున్నాయ్.

డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయిన నేను ఎంతో మంది హితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల అభినందనల్ని అందుకున్నాను. కానీ, అవేవీ నాకు పూర్తి సంతృప్తి నివ్వలేదు.

ఆమెనించి అభినందనల్ని అందుకోవాలనే తపన పెరిగిపోయింది. ఈ విషయమై అప్పుడప్పుడు నాలో నేనే నవ్వుకుంటూండే వాడ్ని - నిరాశగా !

ఎప్పుడో రెండేళ్ళ క్రితం-ఏదో సినిమాహాల్లో- ఇంకేదో విషయమై - ఏవో రెండు మూడు క్షణాలపాటు మాట్లాడినంత మాత్రాన ఆమె నన్ను గుర్తు పెట్టుకుంటుందా? అంత అవసరం ఏముంటుంది ?

ఏదో పనిమీద కాలేజీకి వెళ్ళిన నాకు- గేట్లోంచి లోపలికొస్తున్న ము గ్గురమ్మాయిలు కన్పించారు.

నా గుండెల్లో విపరీతమయిన వుద్వేగం ! మనసు పులకించడం అంటే ఏమిటో..... ఆనందంతో కనులు చెమరించడం అంటే ఎటువంటిదో- హృదయం పురివిప్పి నాట్యం చేయడమంటే ఏమిటో— ఆ క్షణంలో నాకు అనుభవంలోకి వచ్చింది.

ఆ ముగ్గురిలో ఒకామె అనుక్షణం నేను ధ్యానిస్తున్న గుండెల్లో దాచుకుని ఆరాధిస్తున్న.....ఆమే !

ఆమెను ఎలా పలుకరించాలా అనుకుంటున్న తరుణంలో నన్ను చూసిన ఆమె కళ్ళలో సిగ్గుతోపాటు సంతోషం ప్రతిఫలించటంతో నాకొ్కస్త ధైర్యం వచ్చింది. చిరుదరహాసం చేసాయి నా పెదవులు. సమాధానంగా నవ్వాయి ఆమె కనులు.

మొదటిసారి హాల్లో చూసినపుడు మొగ్గలా వున్న ఆమె రూపం యిప్పుడు చిరుగాలికి రెపరెపలాడుతున్న గులాబీ పువ్వులా వుంది. ఆమె చేతులు అప్రయత్నంగా పైటను సరిచేయడం నా దృష్టిలోంచి తప్పిపోలేదు.

"హలో....యిలా వచ్చారేమిటి?" అడిగాను నా సమీపానికి రాగానే.

"డిగ్రీలో చేరటానికి అప్లికేషన్ సబ్‌మిట్ చేద్దామని" ఆమె సమాధానం ఇంపుగా వుంది.

"డిగ్రీ ఫస్ట్‌క్లాసు వచ్చింది." ఆమె అడక్కుండానే చెప్పాను.

"ఐ.సీ. కంగ్రాచ్యులేషన్స్ ...నేనూ అంతే" అందామె ఆనందంగా.

కష్టపడి చదివి, నే తెచ్చుకున్న ఫస్ట్‌క్లాస్‌కి సార్థకత లభించినట్లనిపించింది. కొన్ని రోజుల తర్వాత కాలేజిలో క్లాసులు ప్రారంభమయ్యాయ్.

ఆమెకోసం నేను రోజూ కాలేజికి వెళుతూనే వుండేవాడ్ని. రోజులు గడవడంతోపాటు మా పరిచయం దిన దిన ప్రవర్ధమానమై మాలో ఎవరికీ తెలియకుండానే ప్రేమ చిగుళ్ళు వేసి పురోగమించసాగింది.

ఎన్నో పార్కులు మా ప్రేమకు ఆలవాలమయ్యాయ్. ఇంకెన్నో సినిమాహాళ్ళు మా ప్రేమను అంగీకరించాయ్. మరెన్నో రెస్టారెంట్లు మమ్మల్ని ప్రేమతో ఆహ్వానించాయ్.

ఓ సాయంత్రం....




టర్నర్
పనిముట్లు, మీకు పనితనములో గ్యారంటీనే కాక అత్యుత్తమమైన పేరునూ తెస్తుంది.

ఛాలెంజర్
సబ్‌మెరిసబుల్ పంపులు
95, 130 మరియు 140 M.M. O.D. లలో.

TURNER ENGINEERING COMPANY
775, P. N. Palayam - Coimbatore . 641 037
Phone. 32962

IS : 325

* మోటారులు. * పంపులు.

* మోనోబ్లాకులు.

వ్యవసాయానికి, పరిశ్రమలకు

అత్యుత్తమమైనది.





: తయారించువారు :

సదరన్ ఇంజినీరింగ్
ఇండస్ట్రియల్స్

343, అవనాశి రోడ్డు-కోయంబత్తూరు-641 037.

★

బ్రాంచీలు:—

30, తంబుచెట్టి వీధి, మదరాసు-600 001.

88, అరుణాచల ఆచారి వీధి, సేలం-636 001.

దక్షిణ ప్రాంతానికి విక్రయ ఏజెంట్లు :—

గార్డెన్ ఉడ్ రాఫే ఏజన్సీస్ (ప్రై) లిమిటెడ్,

7/21, బీచ్ రోడ్డు, మదరాసు-600 001.

ఇద్దరం ఒకరికొకరం అనుకుని ఓ పార్కులోని పచ్చిక బయలుమీద విశ్రమించియుండగా—

''రాజూ!'' పిల్చిందామె.

''ఊఁ....'' అన్నాను.

''నేనోటి అడుగుతాను చెప్తావా?''

''అడుగు.''

''నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటావా?''

ఆశ్చర్యపోయాను. ఆమె కళ్ళలోకి చూచాను.

''ఎందుకొచ్చిందా సందేహం?''

''సందేహం కాదు - భయం!''

''అదే....ఎందుకా భయం?''

''ఇన్నాళ్ళూ కల్సి తిరిగి, రేపు నన్ను పెళ్ళి చేసుకోను పొమ్మంటే....''

''ఆఁ... పొమ్మంటే....?'' అన్నాను.

''నే బ్రతకలేను రాజూ!'' ఆమె కనుకొనల్లోంచి అశ్రుబిందువులు జారబోతున్నాయ్. నేను చలించలేదు. ఆమె అంది మళ్ళీ ''నిన్ను విడిచి నేనుండలేను'' అని.

''అయితే ఏం చేస్తావ్?''

''ఏ నిద్ర మాత్రలో మింగి....''

నా నిగ్రహం సడలిపోయింది. చటుక్కున నా చేతులతో అమె నోరు మూసాను. ''పిచ్చి భానూ! ఇంత కాలం.... నీతో తిరిగి, రేపు ఎవర్నో పెళ్ళి చేసుకునేంత దుర్మార్గుడ్ని కాను. మనిద్దరికీ తప్పకుండా పెళ్ళి జరిగి తీరుతుంది.'' ఆమెని దగ్గరికి తీసుకొని కన్నీళ్ళు తుడిచాను.

''నిజంగావా?''

''తప్పకుండా....అయినా నిన్ను విడిచి నేను మాత్రం బ్రతకగలనా?''

''మీ వాళ్ళు ఒప్పుకోకపోతే....?''

''ఒప్పించటానికి ప్రయత్నిస్తాను, ఒప్పుకోక పోతే - ఎదిరించయినా పెళ్ళి చేసుకుంటాను.''

''రాజూ!'' సంతోషంగా చుట్టేసింది.

''మరి మీ వాళ్ళు ఒప్పుకోకపోతే - తెగించి నాతో వచ్చేయగలవా?''

కొన్ని క్షణాలు ఆలోచించి అంది ''ఊఁ...''

రెండు మూడుసార్లు భానుమతి గురించీ, మా పెళ్ళి గురించీ చూచాయగా యింట్లో కదిపి చూచాను. దాదాపు అందరూ నా అభీష్టాన్ని అంగీకరించినట్లే!

ఉద్యోగం కోసం తీవ్ర ప్రయత్నాలు ఆరంభించాను.

ఏడెనిమిది మాసాలు గడిచేసరికల్లా - బెంగుళూరులోని ఇండియన్ టెలిఫోన్స్ యిండస్ట్రీకి, జె. యి. ట్రైనింగ్ కోసం రమ్మని పిలుపు వచ్చింది.

నేను బెంగుళూరుకు వెళ్లినపుడు అంతకాలం నన్ను విడిచి వుండలేనట్లుగా ఆమె చూపిన చూపు నేనెన్నటికీ మర్చిపోలేను.

మరో ఏడాది గడిచేసరికల్లా - పెద్దల అంగీకారంతోనే మా యిద్దరికీ పెళ్ళయిపోవడం, ట్రైనింగ్ పూర్తయిన నాకు వేరే వూళ్ళో అప్పాయింట్‌మెంట్ రావడం, నా భార్యతో సహా ఆ వూరు వెళ్ళిపోవడం జరిగాయ్. 'హనీ మూన్' కంటూ ప్రత్యేకంగా ఎక్కడికీ వెళ్ళకపోయినా - ఏకాంతంగా ఎన్నో స్వర్గసుఖాలు అనుభవించేసాం.

మరో దురదృష్టం ఏమిటంటే ... ఏదో కాశీయాత్రకని కల్పి బయల్దేరిన నా తల్లిదండ్రులు, అత్తమామలు రైలు ప్రమాదంలో పరలోకానికి గతించారు. అటువంటి విపరీత బాధాకరమైన పరిస్థితుల్లో భాను తల్లి కాబోతోందన్న విషయం నాతోపాటు ఆమెకీ రిలీఫ్‌నిచ్చింది.

జాగ్రత్తగా కళ్ళలో వత్తులేసుకొని - కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చిన నాకు ఆమె అంతగా నొప్పులుపడటం భరించలేకపోయాను.

ఆలోచనలలో కొట్టుకుపోతున్న నేను "అమ్మా" అన్న అరుపు వినబడ్డంతో గతంలోంచి బయటపడ్డాను. ఆగొంతు నా భానుది !

ఇంక ఆగలేకపోయాను. ఒక్క వుదుట్న థియేటర్ దగ్గరికెళ్ళి తలుపుల్ని దబదబా బాదసాగాను పిచ్చిగా అరుస్తూ. ఎవరో ఇద్దరు ముగ్గురు నన్ను వెనక్కి లాగ సాగారు. వాళ్ళనించి విడిపించుకొందుకు పెనుగులాడ సాగాను.

థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి మెల్లగా.

డాక్టర్ నన్ను సమీపించాడు.

"మిష్టర్ రాజూ ! బిడ్డ అడ్డం తిరగడంవలన పెద్దాపరేషన్ చేయాల్సివచ్చింది. తల్లీబిడ్డల్ని కాపాడ్డానికి మా శాయశక్తులా ప్రయత్నించాను. కానీ ..."

పిచ్చి ఆవేశంతో ఆయనపైకి దూకాను.

"బిడ్డను మాత్రమే ..బ్రతికించగలిగాను....సారీ ..." అంటున్న ఆయన మాటలు నా చెవికెక్కలేదు. కొంతసేపు గడిచేసరికి —

నేను టాక్సీలో వున్నాను. నా కాళ్ళపై నిర్జీవమైపోయిన నా భార్య. "నా చేతుల్లో నిండా జీవం పోసుకుని జీవితంలో ప్రవేశించబోతున్న నా బిడ్డడు.

నా చెంపలపై యిగిరిపోని అశ్రుకణాలు.

నా రక్తనాళాలన్నీ అశ్రునాళాలైపోయిన అనుభూతి.

టాక్సీడ్రైవర్ మాత్రం ఏ బాధలు, సౌఖ్యాలు తన కంటని స్థితప్రజ్ఞుడిలా వున్నాడు

నాకు గమ్యంలేని— నా గమ్యానికి — తన ప్రస్తుత గమ్యంలా టాక్సీ దూసుకుపోతోంది !


# Bharath Textiles

Manufactures of :

ART SILK CARPETS, COTTON CARPETS & FAST COLOUR BEDSHEETS,

P. B. No. 19, Behind Royal Theatre,

BHAVANI – 638 301.

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు చాలా ప్రసిద్ధమైనది.

వాడిన ప్రతివారూ పదే పదే ఆర్డరిస్తున్నారు.

మా ప్రతినిధిగా వుండేవాళ్ళు మంచి లాభము పొందుతున్నారు.

ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)